జంక్షన్లు జామ్



మైహోం సర్కిల్‌లో ట్రాఫిక్‌జామ్

- గండిపేట మండల పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మణికొండ: హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, కాలుష్యం సమస్యలతో సతమతమయ్యే వారు వాటికి దూరంగా హాయిగా నగర శివారులో ఉందామని తమ నివాసాలను మార్చుకుంటున్నారు. తమ సంస్థలకు సమీపంలో ఉంటే రాకపోకలకు సునాయాసంగా ఉంటుందనే ఉద్దేశంతో ఐటీ ఉద్యోగులు ఇక్కడికే తమ మకాం మారుస్తున్నారు. ఇలా అన్ని రంగాల వారు హైదరాబాద్ శివారులో, ఐటీ సంస్థలకు సమీపంలో ఉన్న గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి, బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీలలో నివాసాలకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఇబ్బడిముబ్బడిగా టవర్లు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం సాగింది. వాటిల్లోకి జనాలు వచ్చి చేరాక పరిస్థితి తలకిందులవుతుంది. నగరంలో ఎదుర్కొన్న ఇబ్బందులే ఇక్కడా పునరావృతం అవుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. వంద అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేసిన రోడ్లు ఏ మూలకు సరిపోని పరిస్థితి తయారయ్యింది. దీంతో ఏ జంక్షన్, సర్కిల్ చూసినా అనుదినం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఐటీ ఉద్యోగులతో పాటు ఇతర రంగాలకు చెందిన వారు ఇంట్లో నుంచి ప్రధాన రోడ్డుకు రావాలంటేనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుందని వాపోతున్నారు. ఉన్న రోడ్లకు, పెరుగుతున్న ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయలేక ట్రాఫిక్ పోలీసులు చేతులెత్తేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

రాబోయే రోజుల్లో..

గండిపేట మండల పరిధిలో ఇప్పటికే లెక్కకు మించి అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, టవర్‌ల నిర్మాణాలు వెలిశాయి. వాటిల్లో వేలాది కుటుంబాలు వచ్చి చేరాయి. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. మణికొండ మున్సిపాలిటీలో 1.50 లక్షలు, నార్సింగి మున్సిపాలిటీలో 2 లక్షలు, బండ్లగూడ మున్సిపాలిటీలో లక్ష వరకు జనాబా పెరిగి పోయిందని ఆయా మున్సిపాలిటీలు, జలమండలి అధికారుల అంచనా లెక్కలు చెపుతున్నాయి. స్థానికంగా నివసిస్తున్న వారితో పాటు పాఠశాలలు, కళాశాలలు, ఫాంహౌస్‌లకు ఆయా మున్సిపాలిటీల మీదుగా అనునిత్యం లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఇంకా నిర్మాణం పూర్తి చేసుకున్న వాటిల్లోకి మరో 30 వేల కుటుంబాలు వచ్చే అవకాశం ఉందని ఓ రియల్ ఎస్టేట్ సంస్థ అంచనా వేసింది. ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్నవి, భవిష్యత్తులో నిర్మాణాలు జరగాల్సిన స్థలాల్లో మరో 80 వేల కుటుంబాలు వచ్చి చేరే అవకావం ఉందని వారు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఉన్న జనాభాతో ఏమాత్రం సరిపోని రోడ్లు రాబోయే జనాబా వచ్చి చేరితే రోడ్ల పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ట్రాఫిక్ సిగ్నళ్లు లేని నార్సింగి సర్కిల్

ఫ్లై ఓవర్లు నిర్మించాల్సిందే..

గండిపేట మండల పరిధిలోని మూడు మున్సిపాలిటీల మీదుగా అనునిత్యం రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు పెద్ద ఎత్తున పెరిగిపోతుండటం, రాబోయే రోజుల్లో ఆ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉండటంతో ఉన్న రోడ్లను మరింత వెడల్పు చేయటం, ట్రాఫిక్ సిగ్నల్‌లను ఏర్పాటు చేయటంతో పాటు అవసరమయిన చోట ఫ్లై ఓవర్‌లను నిర్మించాలనే డిమాండ్ తెరమీదకు వస్తుంది. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అవతార్ సర్కిల్ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో గంటల కొద్ది ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి. దీంతో అక్కడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అటుగా రాకపోకలు సాగిస్తున్న వారు డిమాండ్ చేస్తున్నారు. ఇదే తరహాలో నార్సింగి సర్కిల్‌లోను గండిపేట వైపు వెళ్లేందుకు ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతున్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీరాంనగర్ కాలనీ ప్రవేశం, బండ్లగూడ, కాళీ మందిర్‌ల వద్ద ఫ్లైఓవర్‌లు నిర్మించాలనే డిమాండ్‌లు వస్తున్నాయి. నిర్మాణ రంగ అనుమతుల ద్వార వందల కోట్ల ఆదాయాన్ని పొందుతున్న హెచ్ఎండీఏ, ప్రజలకు అనువైన రోడ్ల సౌకర్యాన్ని కల్పించాల్సిన హైదరాబాద్ గ్రోత్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉన్నతాధికారులు వెంటనే గండిపేట మండల పరిధిలోని రోడ్లపై దృష్టి పెట్టి ట్రాఫిక్ జాంలను నివారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి



డాక్టర్ దుర్గలత, సూపరింటెండెంట్

శంషాబాద్: వర్షా కాలంలో వచ్చే వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని శంషాబాద్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గలత సూచించారు. వర్షా కాలం ప్రారంభం కావడంతో ఇప్పటికే వైరల్ జ్వరాల తీవ్రత పెరుగుతుందన్నారు. డెంగీ, టైఫాయిడ్, మలేరియా, ఫైలిరియా వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత చర్యలు పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ఇందులో కీలకమైందన్నారు. మన ఇంటి పరిసరాల్లో ఎక్కడ కూడా నీటి నిల్వలుండకుండా చర్యలు చేపట్టాలన్నారు. దీంతో పాటు నీరు, ఆహారం విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలుషిత నీరు, ఆహారం తీసకోవడం వల్ల డయేరియాతో విరోచనాలు తీవ్రత పెరుగుతందన్నారు. ఎప్పటికప్పుడు వండుకున్న ఆహారం తీసుకోవడం, మరిగించిన నీటిని మాత్రమే తాగడంతో పాటు ఆహార పదార్థాలపై మూతలు పెట్టుకోవడం తప్పనిసరిగా పాటించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చిన్నపిల్లలకు ఫ్లూవ్యాక్సిన్ ఇప్పించడం ద్వారా జలుబు, దగ్గు, నిమోనియా వంటివి సోకకుండా నిరోధిస్తుందన్నారు.

నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా



ఎమ్మెల్యేను కలిసిన రాజేంద్రనగర్ మహిళా అధ్యక్షురాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మహిళా అధ్యక్షురాలిగా పుట్ట రమాదేవిని నియమించినందుకు గురువారం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతితో పాటు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రెసిడెంట్లు, బ్లాక్ అధ్యక్షులు, మున్సిపల్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి



కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సుజాతను సన్మానిస్తున్న దృశ్యం

బండ్లగూడ: విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని మండల విద్యాధికారి విజయ్ కుమార్ అన్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సుజాతను ఆయన శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. తరగతి గదిలో విద్యార్థులకు ఉత్తమ విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం వివిధ శాఖల అధికారులతో కమిషనర్ బి.శరత్‌చంద్ర సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, తాగునీటి వనరులు వార్డు వారీగా కార్యాచరణ ప్రణాళిక, ఇందిరమ్మ ఇళ్ల రీ వెరిఫికేషన్, ఆర్థిక సంవత్సరం 2025–26లో లక్ష్యంపై సమీక్షించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ డి.చంద్రశేఖర్ రెడ్డి, మేనేజర్ టి.పర్వతాలు, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఆర్‌ఓ కె.శివకుమార్, ఏఈఈ వి.రాజ్‌కుమార్, వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, డీఈవోలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు దదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రను ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్

మణికొండ: భక్తి కుటీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్ర మణికొండ మున్సిపాలిటీ పరిధిలో గురువారం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం గోల్డన్ టెంపుల్ నుంచి ప్రారంభమైన రథయాత్ర చింతచెట్టు సర్కిల్, అలకాపూర్ టౌన్‌షిప్ మీదుగా స్కైలా గేటెడ్ కమ్యూనిటీ వరకు కొనసాగింది. గోల్డన్ టెంపుల్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ రథయాత్రను ప్రారంభించారు. అనంతరం కాలనీల్లో భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారికి పూజలు చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం స్కైలా గేటెడ్ కమ్యూనిటీలోని హాల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాదేశ్యాం దాస్ మాట్లాడుతూ.. జగన్నాథుని కొలిచిన వారికి అన్నీ దక్కుతాయన్నారు. రథయాత్రలో కాంగ్రెస్‌పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్, నాయకులు కిరణ్‌కుమార్, బి.ముత్యాలు, ప్రభావతి పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: జూలై 4న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరుగనున్న గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లిలోని ఆయన నివాసంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూలై 4న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగ సభను ఎల్‌బీస్టేడియంలో నిర్వహిస్తున్నారన్నారు. నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నార్సింగిలో..

మణికొండ: ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం నార్సింగిలోని పార్టీ కార్యాలయంలో నార్సింగి మున్సిపాలిటీ నాయకులు, మణికొండలో రామకృష్ణారెడ్డి నివాసంలో మున్సిపాలిటీ ముఖ్య నాయకుల సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాల్లో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్‌ముదిరాజ్, నాయకులు కిరణ్, గండయ్య, రాము, వినోద్‌కుమార్, వెంకటేష్, లక్ష్మణ్, సాయి పాల్గొన్నారు.



నార్సింగిలో కాంగ్రెస్ నాయకులు

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

బండ్లగూడ: దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దామని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ యాదగిరి అన్నారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటున్నట్లు గురువారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్రకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శతాబ్ద కాలంగా కార్మికవర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలలోని 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందన్నారు. కార్మికుల హక్కుల పోరాటం కోసం ఈ నెల 9న సమ్మె చేపడుతున్నామన్నారు. ఇందులో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్, సుభాష్, నరేందర్, రామాంజనేయులు, జగన్, నవీన్, శ్రీధర్, టౌఫిక్, వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా మండల పూజలు

అత్తాపూర్: హైదర్‌గూడ నల్లపోచమ్మ ఆలయం మండల పూజా మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్, ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో ఆలయ విగ్రహ, యంత్ర, శిఖర ప్రతిష్ఠాపన చేసుకొని 41 రోజులు పూర్తయిన సందర్భంగా అమ్మవారి శిఖరానికి కుంభాభిషేకం, హోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

లక్ష్మీనగర్ పార్కులో ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం



అత్తాపూర్: లక్ష్మీనగర్‌లోని పార్కులో గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నార్మ్ రిటైర్డ్ టెక్నికల్ ఆఫీసర్ నడికుడి ప్రభాకర్ రావుకు లెదర్ బ్యాగు బహూకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సీతారాం, తెలంగాణ ఎకనామిక్స్ ఫోరం సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక అధ్యక్షుడు నేదునూరి కనకయ్య, ఏబీసీ లాఫింగ్ క్లబ్ ఉపాధ్యక్షుడు శ్రీపాద సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్యాచ్ వర్క్ చేయించండి



మణికొండ: అసలే వర్షాకాలం వచ్చింది. రోడ్లపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలిచి వాటి అంచనాలు తెలియక అనేక మంది రోడ్లపై పడి గాయాలపాలయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అలాంటి పరిస్థితి రాకుండా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అనేక రోడ్లపై ఏర్పడిన గోతులను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. పలు కాలనీల్లో రోడ్లపై పడిన గోతులను ప్రజలు ఫొటోలు తీసి సోషల్ మీడియాలలో పోస్టులు పెడుతూ తమ నిరసన, కోరకను తెలియజేస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్ల ప్యాచ్ వర్క్‌ను వెంటనే చేయించాలని వారు కోరుతున్నారు.

శాకంబరి దేవి అలంకారంలో అమ్మవారు

రాజేంద్రనగర్: బుద్వేల్ కోట మైసమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న వారాహి దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు భక్తులకు శాకంబరి దేవి రూపంలో దర్శనమిచ్చారు. శాకంబరి రూపం నేపథ్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అందంగా అలంకరించారు. అమ్మవారితో పాటు ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

గృహిణి అదృశ్యం



శ్యామల రాథోడ్

రాజేంద్రనగర్: భర్త మందలించడంతో భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మామిడి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం..బండ్లగూడకు చెందిన మోహన్ రాథోడ్, శ్యామల రాథోడ్ (38) భార్యాభర్తలు. వీరి మధ్య చిన్న విషయమై బుధవారం ఉదయం గొడవ జరిగింది. దీంతో భర్త మోహన్ రాథోడ్ భార్య శ్యామలను కోపగించాడు. దీంతో శ్యామల ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వీధిదీపాలను ఏర్పాటు చేయాలి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ వాసులు

మైలార్‌దేవ్‌పల్లి: వీధిదీపాలను ఏర్పాటు చేయాలని లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడికే రాజు అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీలో వీధిదీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంటుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధిదీపాలకు మరమ్మతులు చేస్తే అవి వెలుగుతాయని మరికొన్ని ప్రాంతాల్లో కొత్త లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఇదే విషయాన్ని ఉపకమిషనర్ దృష్టికి తీసుకువచ్చామని ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.రవీందర్, ఎస్.అనిల్‌కుమార్, కె.ఏ.రాధాకృష్ణ, వీరేష్, ఎం.ఏ.అజీజ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వినతి



దక్షిణ మధ్య రైల్వే మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: ప్రజల రవాణా సౌలభ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకొని బుద్వేల్ రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ) లేదా అండర్ పాస్‌ను నిర్మించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లా రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకుల బృందం దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ ఉదయ్‌నాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ...నేతాజీనగర్ కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, వేంకటేశ్వర కాలనీ తదితర పరిసర ప్రాంత ప్రయాణికులతో పాటు విద్యార్థులు, వృద్ధులు బుద్వేల్ రైల్వేస్టేషన్‌ను ద్వారా ప్రయాణిస్తుంటారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం బుద్వేల్ రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ) లేదా అండర్ పాస్‌ను నిర్మించాలన్నారు. ప్రస్తుతం బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలు సుమారు 4 కిలో మీటర్ల మేర అదనంగా నడవాల్సిన దుస్థితి ఉందన్నారు. ఇది కేవలం అసౌకర్యమే కాకుండా జీవన భద్రతకు కూడా పెద్ద ప్రమాదమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్, రంగారెడ్డి జిల్లా బీసీ మోర్చా కార్యదర్శి నెల్లుట్ల జగన్, చేవెళ్ల బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ సోల్కర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సబాదా విజయ్ కుమార్, రాజు, రామారావు, చంద్రశేఖర్, శంకర్, కిట్టు పాల్గొన్నారు.

మార్కండేయనగర్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మార్కండేయనగర్ బస్తీ దవాఖానాలో గురువారం ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పాపారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. బస్తీ ప్రజలకు క్షయ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భూషం రమేష్, వీడేం రమేష్, కోట శ్యామ్, కోట పవన్, యాదగిరి భాస్కర్, ధనుంజయ్, టి.గోపాల్, డాక్టర్ హుదా ఫీర్‌దోస్ రహీం, డాక్టర్ నరేష్, మధుబాబు, ఏర్వ కుమారస్వామి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, అనిత, చర్ల రత్న పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఉపేందర్ మాదిగ

బండ్లగూడ: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగల ఉపేందర్‌మాదిగ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దర్గాఖలీజ్ ఖాన్ బీజేఆర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ పునర్ నిర్మాణ ప్రక్రియలో భాగంగా బీజేఆర్ భవన్‌లో మాదిగల చైతన్య సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. 7 నుంచి 31వ తేదీ వరకు వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ల గణేష్‌మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నర్సింహమాదిగ, విద్యార్థి జిల్లా అధ్యక్షుడు భానుప్రకాష్ మాదిగ, మల్లకి రత్నం, సత్తయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

అధ్యక్షుడిగా శివకుమార్ మాదిగ, అధికార ప్రతినిధిగా జయరాజ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా మనోజ్ కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా దర్శన్ మాదిగ, కార్యదర్శులుగా ప్రభాకర్, జగదీష్ మాదిగ, కోశాధికారిగా సామ్యూల్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా సుమన్ మాదిగ, కార్యావర్గ సభ్యులుగా సుధాకర్ మాదిగ, యాకుబ్ మాదిగ, ధనరాజ్ మాదిగ, సునీల్‌కుమార్ మాదిగ, సురేష్ మాదిగ, ప్రవీణ్ మాదిగ, గౌరవ సలహాదారులుగా మల్లాకి రత్నం మాదిగ, రామరాజు మాదిగ, రాజు మాదిగ, ప్రవీణ్‌కుమార్ మాదిగ, సత్యంమాదిగను ఎన్నుకున్నారు.